క్లుప్తంగా

ఆక్రమణకు గురవుతున్న కాలువ


ఆక్రమణకు గురవుతున్న ఇరిగేషన్ కాలువ

పెనుకొండ రూరల్: పెనుకొండ ప్రాంతంలో పరిశ్రమల రాకతో భవన నిర్మాణాలు, వాణిజ్య వ్యాపారాలకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో కాలువలు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయి. నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం క్రాస్ వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఇరిగేషన్ కాలువ ఆక్రమణకు గురవుతోంది. ముత్యాల చెరువు నుంచి కురుబవాండ్లపల్లి చెరువుకు ఈ కాలువ గుండా నీరు పోయేది. అయితే కాలువ ఆక్రమణకు గురైతే ఎగువ ప్రాంతంలోని రైతుల పొలాలు ముంపునకు గురవుతాయని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

డివిజన్‌స్థాయి స్పందన రద్దు

రొళ్ల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ ఆధ్వర్యంలో జరగాల్సిన డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని రద్దుచేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

పెనుకొండ: శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సీఐటీయూ ఉద్యమం చేపడుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం సీఐటీయూ మహాసభ రెండో రోజూ కొనసాగింది. సమావేశంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అసంఘటిత కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్మిక చట్టాలను వెంటనే సవరణ చేసి కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్రం చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు రమేష్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని సంత మార్కెట్, పోలీస్‌స్టేషన్ ఆవరణ, కంచిసముద్రం రోడ్లలో ఎస్ఐ మునీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు సంబంధించిన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ తదితర సర్టిఫికెట్లను పరిశీలించారు. సరైన డాక్యుమెంట్లు లేని వాహనాల డ్రైవర్లకు అపరాధ రుసుము వసూలు చేశారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న నూతన సర్పంచ్ ఉపేంద్రరెడ్డి

హిందూపురం: చలివేందుల పంచాయతీ అభివృద్ధి కృషి చేస్తామని ఇటీవల ఉప ఎన్నికలల్లో గెలుపొందిన సర్పంచ్ ఉపేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం గ్రామ సచివాలయం వద్ద అట్టహాసంగా ప్రజల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి హర్షద్ బాబా, ఇతర శాఖాధికారుల సమక్షంలో ప్రమాణాస్వీకరణతో పాటు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా అధికారులతో మాట్లాడి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి రాజశేఖర్, వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి, నరేష్‌గౌడ్, రామకృష్ణ, శ్రీరాంరెడ్డి, కిష్టప్ప, నాగేంద్రప్ప, ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అవగాహన

రొద్దం: మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చట్టాలపై అవగాహన కల్పించినట్లు దివ్యాంగుల సొసైటీ సీఈఓ వరలక్ష్మి తెలిపారు. దివ్యాంగుల హక్కులు, చట్టాలు, మేనరికపు వివాహాలు, స్త్రీలపై చిన్నచూపు అనే అంశాలపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు.

స్వగృహమస్తు

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హులందరికీ స్థలాలను మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. వందలాది ఎకరాలను సేకరించి జగనన్న లేఅవుట్‌లుగా తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పిస్తున్నారు. సొంతింటి కల సాకారం కావడంతో పేదలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 'పురం' నియోజకవర్గంలో జోరుగా ఇళ్ల నిర్మాణం
- ఇప్పటికే 2,870 నిర్మాణాల పూర్తి
- ప్రభుత్వం అన్ని విధాలా సహకరించిందని లబ్ధిదారుల హర్షం


మనేసముద్రంలో పూర్తయిన ఇల్లు

హిందూపురం అర్బన్: నియోజకవర్గ వ్యాప్తంగా పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు కూడా కట్టించి ఇస్తున్నారు. గృహ నిర్మాణశాఖ లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తోంది. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా 11,512 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 2,870 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఎక్కడా నాణ్యతా లోపం లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

48 జగనన్న కాలనీలు

పేదలందరూ ఇళ్లు నిర్మించుకునేలాగా నియోజకవర్గ వ్యాప్తంగా హిందూపురం అర్బన్, రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లోని 48 వైఎస్సార్ జగనన్న కాలనీలు (లేఅవుట్లు) ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేసుకున్నారు.


మనేసముద్రంలో వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణాలు

హిందూపురం నియోజకవర్గంలో ఇళ్ల వివరాలు ఇలా..				
మండలం	మంజూరు	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తయినవి	వెచ్చించిన మొత్తం
హిందూపురం రూరల్	1500	965	635	రూ.12.24 కోట్లు
చిలమత్తూరు	1278	627	651	రూ.12.59 కోట్లు
లేపాక్షి	1343	879	464	రూ.9.92 కోట్లు
హిందూపురం అర్బన్	7391	6,271	1120	రూ. 34.92 కోట్లు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించింది. కాలనీల్లో నీరు, విద్యుత్, ప్రధాన, అంతర్గత రోడ్లు, పైప్‌లైన్లు, వీధి దీపాలు ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 48 కాలనీల్లో 8,007 ఇళ్లు మంజూరుకాగా.. 7,563 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. 444 ఇంటి నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇందుకు రూ.27.04 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

సకాలంలో బిల్లుల మంజూరు



పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారుల సహకారం , సంబంధిత అధికారుల కృషితోనే ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తవుతున్నాయి. మరో నెల రోజుల్లో నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. ఇళ్లు నిర్మించుకొంటున్న లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో ప్రభుత్వం విడుదల చేస్తోంది.

– నారాయణరెడ్డి, గృహనిర్మాణశాఖ ఏఈ, హిందూపురం

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వంతో పాటు అధికారుల సహకారంతో నా సొంత జాగాలో ఇంటి నిర్మాణం పూర్తీ చేసుకున్నాను. మొదట్లో సొంతిల్లు నిర్మించుకొంటానా అనే అనుమానం ఉండేది. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు మంజూరయ్యాయి. జగనన్న నా సొంతింటి కలను నెరవేర్చాడు. ఎంతో సంతోషంగా ఉంది.

– ఈశ్వరరెడ్డి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు

'పురం'లో అప్రమత్తం

- అన్ని సర్కిళ్ల వద్ద పోలీసు బందోబస్తు

హిందూపురం: టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించిన నేపథ్యంలో హిందూపురం పట్టణంలో పోలీసులు అన్ని సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని అంబేడ్కర్‌సర్కిల్ వద్ద సాయంత్రం నుంచి హైడ్రామా నెలకొంది. ఆదివారం సాయంత్రానికి కోర్టు చంద్రబాబును విడుదల చేస్తుందని, సంబరాలు జరుపుకోవాలని టీడీపీ భావించా అక్కడే వేచి చూశారు. అయితే ఏసీబీ కోర్టు చంద్రబాబును 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించడంతో నాయకులు ఒక్కసారిగా నిరుత్సాహానికి గురై వెళ్లిపోయారు. కాగా పట్టణమంతా పోలీసులు ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి సర్కిల్ వద్ద పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు.

పోలీసు యాక్ట్ అమలులో ఉంది

పోలీస్‌యాక్ట్ ప్రకారం పట్టణంతో పాటు డివిజన్ పరిధిలో నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడరాదని డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. అతిక్రమిస్తే 144 యాక్ట్‌ను పక్కాగా అమలు చేయడం జరుగుతుందన్నారు. అతిక్రమించిన వారిని 188 యాక్టు కింద అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. 151 ముందస్తు అరెస్టు కాకుండా ఇప్పటికే 16 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే 341, 188 కేసుల కింద 11 కేసులు నమోదైనట్లు చెప్పారు. హిందూపురంతో పాటు చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో కూడా ప్రత్యేక పోలీసులు బలగాల బందోబస్తు ఉంది. ముందస్తు జాగ్రత్తలు అన్ని చోట్ల బందోబస్తు ఉంది.


పురంలో సర్కిల్ వద్ద పోలీసు బందోబస్తు పర్యవేక్షిస్తున్న డీఎస్పీ కంజాక్షన్

మడకశిరలోనూ...

మడకశిర: టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో నియోజకవర్గంలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేట్టారు. సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయా మండలాల ఎస్ఐలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. బయటకు రాకుండా టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మడకశిరతో పాటు అన్ని మండలాల్లోని ప్రధాన కూడళ్లలోనూ గస్తీ ఏర్పాటు చేశారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ టీచర్స్ ఫెడరేషన్ హిందూపురం మండల నూతన కమిటీను ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికల అధికారులు అంజనమూర్తి, రవిశేఖర్, రామదాస్ నాయక్‌లు సమక్షంలో ఎన్నికలు జరిపారు. గౌరవాధ్యక్షుడిగా వెంకటరమణప్ప, గౌరవ సలహాదారులుగా మల్లికార్జునరెడ్డి, రంగమ్మ, అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా నారాయణస్వామి, జిల్లా కౌన్సిలర్లుగా సలీం బాషా, మోహన్‌కుమార్, ఆదినారాయణ, సుధాబాయి, ఆంజనేయులు, ఆదిలక్ష్మీ, నారాయణస్వామి, ఉమా, మహేష్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా నాగమణి, గంగాధర్, వెంకటేష్ ప్రసాద్, ఆదినారాయణ నాయక్, పరంధాములు, అనీస్ అహమ్మద్, సహాయ కార్యదర్శులుగా లీలావతి, రవీంద్ర, అన్నపూర్ణ, మజహార్ హుస్సేన్, రవికుమార్, గోపాల్, ఆడిట్ కన్వీనర్‌గా ఇలియాజ్, సభ్యులుగా షామీర్ బాషా, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఉత్తమ అవార్డులు పొందిన ఎంఐఎస్ కోఆర్డినేటర్ తౌసిఫ్ అలీ ఖాన్, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ వెంకటేష్, సీఆర్‌పీ ఫైరోజ్, ఐఈఆర్‌టీ లలిత, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఇస్మాయిల్, కొండయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గురురాజారావు, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ చెరువు కట్ట కింద నిర్మాణం చేస్తున్న కల్వర్టు పనులను ఎంపీపీ ఈరన్న ఆదివారం పరిశీలించారు. అమరాపురం- హేమావతి ప్రధాన రోడ్డులో చెరువులో నీరు చేరినప్పుడు రోడ్డు మరమత్తుకు గురైంది. దీంతో రోడ్డుకు అడ్డంగా చెరువులోని నీరు బయటికి వెళ్లేలా కల్వర్టు పనులు చేపట్టారు. పనులను నాణ్యంగా చేయాలని ఎంపీపీ ఈరన్న కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రమాదాలకు అడ్డా!

- 44వ నంబర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- డ్రైవర్ల నిర్లక్ష్యమే ప్రమాదాలకు ప్రధాన కారణం
- ప్రమాదాలు అరికట్టేందుకు అధికారుల చర్యలు



హిందూపురం అర్బన్: 44వ నంబర్ జాతీయ రహదారి అంటేనే ప్రజలు, వాహనదారులు హడలిపోతున్నారు. బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారిపై పెనుకొండ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో వారంలో మూడు నాలుగు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటమే ప్రధాన కారణం. ఆయా ఘటనల్లో ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతుండగా పలువురు క్షతగాత్రులుగా మారుతున్నారు.

ఫ్లైఓవర్లు లేకపోవడంతో...

పెనుకొండ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న 44వ నంబర్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్లు లేకపోవడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద వంతెనలు ఏర్పాటు చేయకపోగా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. ఇది అప్పటి పాలకుల నిర్లక్ష్యానికి కారణం చెబుతున్నారు. దీనివల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.

రెండేళ్లలో 36 మంది మృత్యువాత

– కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటు చేసి అండర్ పాస్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు.

– కోడూరు – కదిరి మలుపు వద్ద కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి.

– పాలసముద్రం వద్ద నాలుగు రహదారుల కూడలిలో జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి.

– పెనుకొండ వై జెంక్షన్ వద్ద నిత్యం ప్రమాదాలు చేటు చేసుకుంటుంటాయి.

– పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో పోలీసుల రికార్డుల ప్రకారం గత రెండేళ్ల కాలంలో 22 ప్రమాదాలు జరగ్గా 36 మంది మృత్యువాత పడ్డారు. 88 మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఆటోలు, ద్విచక్ర వాహనదారులే ఎక్కువ...

జాతీయ రహదారిపై నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. గార్మెంట్స్ పరిశ్రమలుకు వెళ్లే ఆటోల్లో ఇష్టారాజ్యంగా పరిమితికి మించి మహిళలను తరలించడం ప్రమాదానికి కారణమవుతోంది. నాలుగు నెలల క్రితం ఓ ఆటో ప్రమాదంలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. కోడూరు తోపు ప్రమాదాల కేంద్రంగా మారింది. ఈ మధ్యనే లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రెండు నెలల క్రితం జాతీయ రహదారిపై ఆంజనేయ దేవాలయం సమీపంలో ఓ వాహనం అదుపు తప్పి డివైడర్ అవతలి వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా 8 మందికి గాయాలయ్యాయి.

అవగాహన కల్పిస్తున్నాం



జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు తరచూ తనిఖీలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. అధిక వేగంగా వెళ్లే వాహనాలు, మద్యం సేవించి నడిపే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని సూచించాము. ప్రమాదాలు జరిగిన తరువాత కాకుండా ముందే వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. – కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

క్రికెట్ టోర్నీ విజేత గుడిబండ


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణ కేంద్రంలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీలో గుడిబండ విజేతగా నిలిచింది. యూటీఎఫ్ నాయకులు రామాంజినేయులు జ్ఞాపకార్థం జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో మొదట బ్యాటింగ్ చేసిన రొద్దం జట్టు 133 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన గుడిబండ జట్టు 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామాంజినేయులు సతీమణి వాణి విజేతలకు బహుమతులు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మ్యాన్‌గా నరేష్, బెస్ట్ బౌలర్‌గా వంశీలకు ట్రోఫీలను అందజేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతులతో మహిళలు

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తులు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు గంగాజలంలో స్వామివారి ప్రతిమను అభిషేకించారు. తర్వాత స్వామివారి విగ్రహాన్ని వెండి ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులు జ్యోతులను మోసుకుని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపుగా సమీపాన ఉన్న సిద్ధేశ్వరస్వామికి సమర్పించారు.

వెండి అలంకరణలో సిద్ధేశ్వరస్వామి



అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆదివారం వెండి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా స్వామి వారికి అర్చకులు తెల్లవారుజామున సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో పాటు స్వామివారికి వెండితో అందంగా అలంకరించారు. తర్వాత మహా మంగళ హారతి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వీరభద్రస్వామికి పూజలు


అలంకరణలో వీరభద్రస్వామి

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం పెద్ద ఎత్తున పర్యాటకులు సందర్శించుకున్నారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవారులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకార్చనలు, తీర్థప్రసాదాల వినియోగం, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.